సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం ၊ 25 ၊ సెప్టెంబర్ ၊ 2024



మిడ్‌మానేరుకు ఎస్సారెస్పీ నీరు

బోయినపల్లి: మిడ్‌మానేరులోకి ఎస్సారెస్పీ నుంచి 6వేల క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేశారు. మరో 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నీటిమట్టం 24.33 టీఎంసీలకు చేరింది.



ఆక్రమణల పర్వం

మధ్యమానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో మిగులు భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/24.0

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

'పది' సిలబస్.. చేరేనా టార్గెట్?



- 50 శాతం పూర్తి..
- శతశాతానికి మిగిలింది 3 నెలలు
- అక్టోబర్ నెల నగం దసరా సెలవులే..
- లక్ష్యాన్ని చేరేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామంటున్న డీఈవోలు
- ఉమ్మడి జిల్లాలో 1,931 పాఠశాలలు

టీచర్ల బోధన.. విద్యార్థుల చదువు ముందు నుంచి ఒక ప్రణాళిక ప్రకారం సాగితేనే పదోతరగతిలో మంచి ఫలితాలు వస్తాయి. డిసెంబర్ 31 నాటికి పాఠ్యాంశాల బోధన పూర్తి చేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 50 శాతం వరకు సిలబస్ పూర్తయిందని డీఈవోలు చెబుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో బడిబాట, టీచర్ల బదిలీలు, పదోన్నతులు, స్వచ్ఛతా హీ సేవ, పోషణ్ అభియాన్ వంటి కార్యక్రమాలు, ఎఫ్ఎల్ఎన్ శిక్షణతో కొంత ఇబ్బంది కలిగినా.. నష్టపోయిన సమయాన్ని పూడ్చేందుకు ప్రత్యేక దృష్టిసారించామని అంటున్నారు. అయితే, వరుస సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తి చేయడం సాధ్యమేనా అన్న సందేహాలను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి

పెద్దపల్లిలో కలెక్టర్ నజర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జెడ్పీ 100, ఉన్నత పాఠశాలలు 04, ఆదర్శ 07, మైనారిటీ గురుకులాలు 04, ఎయిడెడ్ 05, కేజీబీవీలు 10, గురుకులాలు 10, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు 172 ఉన్నాయి. వీటిల్లో 19 వేల మందికి పైగా విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఆయా స్కూళ్లలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన జరిగేలా విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. వచ్చే నెలలో సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గతేడాది ఫలితాల్లో జిల్లా 92.4 శాతం సాధించి, రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచిందని, ఈసారి అంతకన్నా మెరుగైన ఫలితాలు రావాలని సూచించారు.

సమ్మేటివ్ పరీక్షలకు సిద్ధం



ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన సాగుతోంది. అక్టోబర్ 21 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాం. ఇప్పటివరకు ఉన్న లక్ష్యాల మేరకు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సిలబస్ పూర్తయింది.

– పీఎం షేక్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి



కథలాపూర్ స్కూల్లో ప్రత్యేక తరగతులు (ఫైల్)

జగిత్యాల హ్యాట్రిక్ నుంచి 24వ స్థానం

జగిత్యాల: జగిత్యాల 2016–17, 2017–18, 2018–19 పదోతరగతి ఫలితాల్లో వరుసగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి, హ్యాట్రిక్ సాధించింది. గతేడాది 84.05శాతం ఉత్తీర్ణతతో 24వ స్థానానికి పడిపోయింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 13, జిల్లా పరిషత్ 175, ఆదర్శ 13, కేజీబీవీలు 14, బీసీ వెల్ఫేర్ 06, మైనారిటీ 05, టీఎస్ రెసిడెన్షియల్ 02, సోషల్ వెల్ఫేర్ 5, ప్రైవేట్ పాఠశాలలు 104 మొత్తం 337 స్కూళ్లు ఉన్నాయి. 11,991 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 50 శాతం సిలబస్ పూర్తి చేశామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ.. పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. జనవరి 1 నుంచి ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. టీచర్లు సీ–గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అయితే, సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తవుతుందా అని తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

వందశాతం ఫలితాలకు చర్యలు



పదోతరగతిలో వందశాతం రిజల్ట్స్‌కు చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సిలబస్ డిసెంబర్ 31 వర కు పూర్తయ్యేలా చూస్తాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. – జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

కరీంనగర్‌లో ఇన్‌చార్జి ఎంఈవోలే..

కరీంనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి సిలబస్ అటూఇటుగా 50 శాతం పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తం 16 మండలాలు ఉంటే అన్నిచోట్లా ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారు. దీంతో టీచర్లపై పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలున్నాయి. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేసి, వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మెరుగైన ఫలితాలు రావడానికి అస్కారం ఉంటుంది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు, క్రిస్మస్‌కు నాలుగు రోజులతోపాటు సాధారణ సెలవులు ఉండనున్నాయి. మరి డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తవుతుందో లేదో వేచిచూడాలి. వీలైనంత త్వరగా సిలబస్ పూర్తి చేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా 95 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి, రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది.

జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలు 65, ఎంపీపీ/జెడ్పీ 598, కేజీబీవీ 14, ఆదర్శ 11, ప్రైవేట్ 323, ప్రైవేట్ ఎయిడెడ్ 12, ఎస్సీ గురుకులాలు 08, బీసీ గురుకులాలు 11, మైనార్టీ గురుకులాలు 09, స్పోర్ట్స్ స్కూల్ 01, అర్బన్ రెసిడెన్షియల్ 02 మొత్తం 1,060 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో పదోతరగతి విద్యార్థులు మొత్తం 12,695 మంది ఉన్నారు.



ఇటీవల తిమ్మాపూర్‌లోని జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేసి, భోజనం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులు



పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశాం. నిరంతర పర్యవేక్షణకు తనిఖీలు చేపడుతున్నాం. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి, ఫలితాల్లో కరీంనగర్‌ను ముందంజలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దసరా సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. – జనార్దన్‌రావు, డీఈవో

గతేడాది సిరిసిల్లకు మూడోస్థానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పదోతరగతి ఫలితాల్లో జిల్లా ఏటా మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. గత మూడేళ్లలో ఏడో స్థానం నుంచి మూడో స్థానానికి ఎగబాకింది. గతేడాది 98.27 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రస్తుతం మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. దసరా సెలవులకు ముందు సగం సిలబస్ పూర్తి చేశామని, డిసెంబర్‌లోగా శతశాతం చేరుకుంటామని అంటున్నారు. కానీ, ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కారణంగా కొన్ని పాఠశాలల్లో 40 శాతమే పూర్తయినట్టు పలువురు సీనియర్ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 ముగిసేనాటికి సగం సిలబస్ అవుతుందంటున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 114, గురుకుల రెసిడెన్షియల్ 20, ఆదర్శ 07, కేజీబీవీలు 13, ప్రైవేటు 68 మొత్తం 222 పాఠశాలలున్నాయి. 6,890 మంది పదోతరగతి చదువుతున్నారు.

అల్పాహారానికి నిధులు ఎలాగో?

ఏటా పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల సమయంలో గోరుముద్ద పేరిట అల్పాహారం అందిస్తున్నారు. దీనికి విద్యాశాఖ నిధులు కేటాయిస్తున్నా ఆయా పాఠశాలల పరిధిలోని దాతలు, ఎన్నారైలు, ప్రజాప్రతినిధులు విద్యార్థుల శ్రేయస్సు కోసం అల్పాహారానికి తమవంతు సాయం చేసేవారు. అయితే, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తే రాజకీయం అవుతుందన్న చర్చ గతంలో జరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి అల్పాహారం కోసం నిధులు ఎలా సమకూరుస్తారో వేచిచూడాలి.



ఇటీవల వీర్నపల్లి కస్తూరిబా పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

ప్రథమ స్థానమే ధ్యేయం



పదోతరగతి ఫలితాల్లో గతేడాది జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈ విద్యాసంవత్సరం ప్రథమ స్థానమే ధ్యేయంగా మరింత మెరుగైన విద్యాబోధన చేపడుతున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటాం. లక్ష్య సాధనలో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని హెచ్‌ఎంలకు, టీచర్లకు సూచించాం. – రమేశ్, డీఈవో

న్యూస్‌రీల్

రాజీ మార్గాన్ని ప్రోత్సహించండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధికజైస్వాల్

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: కక్షిదారుల్లో రాజీమార్గాన్ని ప్రోత్సహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికజైస్వాల్ అన్నారు. ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్.ప్రేమలత ఆదేశాల మేరకు న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజీపడే కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకట్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి



మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ ఎదుట కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు రూ.26వేలు కనీస వేతనం, రూ.25లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుర్రం అశోక్, సుల్తాన్ నర్సయ్య, రాజయ్య, దేవయ్య, శ్రీనివాస్, బాలయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ ఏడీకి వార్పిన్ కార్మికుల వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం అందించే చీరల ఆర్డర్ డిజైన్‌లను వార్పిన్ మిషన్‌లపై భీములు పోయించాలని పాలిస్టర్ వార్పిన్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు సీఐటీయూ కార్యదర్శి మూశం రమేశ్‌తో కలిసి సిరిసిల్ల టెక్స్‌టైల్ ఏడీకి వినతిపత్రం అందించి మాట్లాడారు. తద్వారా వైపని కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి అందించే అవకాశం ఉంటుందన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అనుబంధమైన వార్పిన్ రంగంలో 300 మంది కార్మికులు పనిచేస్తున్నారని వారికి ఉపాధి అందించేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. నాయకులు సిరిమల్ల సత్యం, డి.రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

30న దివ్యాంగులకు స్పెషల్ బస్‌పాస్ మేళా

సిరిసిల్లటౌన్: దివ్యాంగులకు ఈ నెల 30న స్థానిక కొత్త బస్టాండ్‌లో ప్రత్యేక బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మేళా నిర్వహిస్తామని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సదెరం సర్టిఫికెట్‌లో లోకో మోటర్, ఆర్థో విభాగంలో 40శాతం ఉండాలని, వినికిడి, దృష్టిలోపం 100శాతం ఉండాలన్నారు. మెంటల్ రిటార్డేషన్ ఉన్నవారి ఐక్యూ 69 శాతం కంటే తక్కువ ఉండాలని పేర్కొన్నారు. ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదెరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్సు, ఐడీకార్డ్, సర్వీస్‌చార్జ్ కోసం రూ.50 తీసుకుని మేళాలో పాల్గొని పాస్‌లు పొందాలని సూచించారు.

రేపు కొదురుపాకకు ఎమ్మెల్యే కేటీఆర్ రాక

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకలో ఈ నెల 26న జరిగే పాఠశాల భవన ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పాల్గొంటారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంగళవారం తెలిపారు. కొదురుపాకలో తన సొంత నిధులతో అమ్మమ్మ, తాతయ్య జోగినిపల్లి లక్ష్మి కేశవరావు దంపతుల జ్ఞాపకార్థం కేటీఆర్ పాఠశాల భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించారని రవిశంకర్ పేర్కొన్నారు. పాఠశాల భవన ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అడుగు వేయలేం.. పరుగు తీయలేం

- చినుకు రాలితే చిత్తడే
- వాకింగ్ ట్రాక్ లేదు.. ఒపెన్ జిమ్ లేదు
- అభివృద్ధికి రూ.1.60 కోట్లు.. పనులు జరగక పాట్లు
- ఇది సిరిసిల్ల కాలేజీ మైదానం దుస్థితి



సిరిసిల్ల కాలేజీ మైదానంలో స్నానాల గదులు లేక.. ఇక్కడ ఆటలకోసం వివిధ జిల్లాల క్రీడాకారులు వస్తే ఇలా ఆరు బయటే బోరు వద్ద స్నానాలు చేయాల్సి వస్తుంది. నిజానికి మైదానాన్ని ఆధునీకరిస్తూ స్నానాల గదులు నిర్మించారు. కానీ, వాటిని వినియోగించడం లేదు. ఫలితంగా పొరుగు జిల్లాల ఆటగాళ్లు ఉసూరుమంటూ కాలేజీ గ్రౌండ్‌లో ఇలా స్నానాలు చేసి జిల్లా కేంద్రం గొప్పదనాన్ని రాష్ట్ర మంతాట చాటిచెబుతున్నారు.



ఇది కూడా కాలేజీ మైదానంలోని ఓ భాగం. చిన్నపాటి వర్షం పడితే చాలు గ్రౌండ్ అంతా చిత్తడిగా మారి ఎందుకూ పనికిరాకుండా పోతోంది. మొన్న స్వాతంత్ర్య దినోత్సవానికి పోలీస్ పరేడ్ నిర్వహించేందుకు తాత్కాలికంగా రాతిడస్ట్ పోసి చదును చేశారు. కానీ మైదానమంతా చేయకపోవడంతో వర్షం పడితే ఇలా బురదమయంగా మారుతుంది. వాకింగ్‌కు కాదుకదా అడుగుపెట్టేందుకు కూడా ఇబ్బందిగా ఉంటుంది.



ఇది సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని పైకా భవనం ఎదుట దుస్థితి. పైకా భవనం బోరు నీరు వెళ్లిపోయేందుకు కాల్వ వసతి లేదు. కనీసం ఇంకుడు గుంతైనా లేదు. ఫలితంగా బోరు పెట్టినప్పుడల్లా వృథాగా పోయే నీరు ఇలా మైదానంలో పారుతోంది. బురదమయంగా మారి గ్రౌండ్‌కు వచ్చేవారికి ఇబ్బందిగా మారుతోంది.

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని ఏకైక మైదానం.. జూనియర్ కళాశాల గ్రౌండ్. ఇక్కడ నిత్యం పిల్లలు ఆటలు ఆడుకుంటారు. పట్టణవాసులు వాకింగ్ చేస్తుంటారు. సిరిసిల్ల నడిబొడ్డున ఉన్న ఈ మైదానం ఏళ్లుగా అందరికీ ఆటలకు, వాకింగ్‌కు ఉపయోగపడుతుంది. ఈ మైదానాన్ని మరింత అభివృద్ధి చేయాలని, వాకింగ్ ట్రాక్ వేసి, ఒపెన్ జిమ్‌లను నిర్మించి, గ్యాలరీలతో, క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 2022లో అప్పటి రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో చేపట్టిన పనులు ఏడాదిన్నరగా ఎక్కడికక్కడే ఉండడంతో మైదానం మరింత అధ్వానంగా మారింది. 'ఆ రూ.2 కోట్ల పనులు చేయక ముందే ఈ కాలేజీ గ్రౌండ్ బాగుండే' అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. మున్సిపల్ ఇంజినీర్ల పట్టింపులేని తనానికి, కాంట్రాక్టర్, పాలకవర్గం నిర్లక్ష్యానికి ఈ మైదానం నిదర్శనంగా నిలుస్తుంది.

మట్టిపోసి చెడగొట్టారు

కాలేజీ గ్రౌండ్ చుట్టూ ప్రహరీ ఉంది. ఎప్పుడు వర్షం పడినా మైదానంలో వరద చేరుతోంది. నీరు వెళ్లిపోయే మార్గం లేక గ్రౌండ్ చెరువులా మారేది. ఈ ఒక్క సమస్య తప్ప పెద్దగా ఏ సమస్య అప్పట్లో లేకుండే. ఈ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్, మురికి కాల్వ, ఆటల భవనం, మరుగుదొడ్లు, గ్యాలరీ, స్వాగత తోరణ ఆర్చీ, గేట్ల నిర్మాణం వంటి పనులకు రూ.2 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో టెండర్లు పిలువగా రూ.1.60 కోట్లతో పనులు ప్రారంభించారు. గ్రౌండ్‌లో మట్టిపోసి మైదానాన్ని చెడగొట్టారు. వర్షం పడితే చాలు.. గ్రౌండ్ అంతా బురదమయంగా మారుతుంది. అడుగు వేయలేం.. పరుగుతీయలేని దుస్థితి నెలకొంది. ఆటల భవనం నిర్మించి, గ్యాలరీ కట్టి వదిలేశారు. 70 శాతం మేరకు పనులు పూర్తయినా ఇంకా 30 శాతం ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. చేసిన పనులకు రూ.45 లక్షల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి కోసం కాంట్రాక్టర్ మిగతా పనులను వదిలేశారు.

పట్టణ వాసుల అసహనం..

సిరిసిల్ల పట్టణం అభివృద్ధిలో ముందుండగా కాలేజీ మైదానం మాత్రం వెనకబడింది. నిత్యం వాకింగ్ చేసే వారు, ఆడుకునే పిల్లలు మైదానంలో అసంపూర్తి పనులతో ఇబ్బందులు పడుతూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు మైదానంలో పెండింగ్ పనులు పూర్తి చేసి, వాకింగ్ ట్రాక్, ఒపెన్ జిమ్‌ను అందుబాటులోకి తెస్తే పట్టణ వాసులకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని పంచినట్లు అవుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రౌండ్ బాగులేక ఇబ్బంది



నేను చాలాకాలంగా వాకింగ్ చేస్తున్న.. కాలేజీ మైదానం బాగులేక ఇబ్బంది పడుతున్నారు. మైదానం బాగవుతుందని అందరం సంతోషపడ్డాం. కానీ పనులు పెండింగ్‌లో పడి బాధపడుతున్నాం. పెండింగ్ పనులు పూర్తి చేసి అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి. – మహేశ్, రైస్‌మిల్లర్, సిరిసిల్ల

పనులు పూర్తి చేయాలి



కాలేజీ గ్రౌండ్‌లో పనులు పెండింగ్‌లో ఉండడం చాలా ఇబ్బందిగా ఉంది. పెండింగ్ పనులు పూర్తి చేయాలి. నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతున్నం. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చొరవచూపాలి.

– సబ్బని నరేందర్, వస్త్ర వ్యాపారి, సిరిసిల్ల

అందుబాటులోకి తెస్తాం



కాలేజీ మైదానంలో పెండింగ్ పనులు పూర్తి చేయిస్తాం. ఒపెన్ జిమ్ ఏర్పాటు చేస్తాం. వర్షాల కారణంగా కొన్ని పనులు చేసేందుకు ఆటంకం ఏర్పడింది. పట్టణ వాసులకు మైదానాన్ని అందుబాటులోకి తెస్తాం.

– జిందం కళాచక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, సిరిసిల్ల

రేషన్ డీలర్లకు ప్రొసీడింగ్స్

- రాత్రి వేళ ఇవ్వడంపై విమర్శలు



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో రాత్రికి రాత్రే రేషన్ డీలర్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం విమర్శలకు తావిచ్చింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బొల్లి రామ్మోహన్ మాట్లాడుతూ, మంగళవారం రాత్రి 9గంటలకు రేషన్ డీలర్లకు ప్రొసీడింగ్ ఇవ్వడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీసులో కాంగ్రెస్ నేతలు దగ్గరుండీ ప్రొసీడింగ్స్ ఇప్పించారన్న వార్తలు బయటకు పొక్కడంతో బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. డీలర్ల పరీక్ష, ఇంటర్వ్యూలు, అభ్యర్థుల ఎంపిక పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు కాంగ్రెస్ నేతలు అధికారులతో కుమ్మక్కై తమ అనుయాయులకు డీలర్‌షిప్‌లు ఇప్పించుకున్నారని, ఇందు కు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారని ఆరో పించారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ డీలర్ల పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు కోడం శంకర్, వెంగళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ఖాళీ పోస్టులకు ఇంటర్వ్యూ

సిరిసిల్ల: జిల్లాలోని మైనార్టీ విద్యా సంస్థల్లో ఖాళీ ఫ్యాకల్టీ పోస్టులకు ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేసేందుకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఇంటర్వ్యూ నిర్వహించారు. జూనియర్ లెక్చరర్ (జేఎల్) ఇంగ్లిష్, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ మ్యాథ్స్, టీజీటీ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జూలజీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఒక్కో పోస్టుకు మెరిట్ ప్రకారం ఆరుగురు అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలిచారు. 8 పోస్టులకు 48 మందిని ఆహ్వానించగా.. 32 మంది హాజరయ్యారు. ఆర్ఎల్‌సీ రాజేందర్, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి మైనార్టీ ఆఫీసర్ రాధాభాయ్, ఓఎస్‌డీ సర్వర్ మియా, ప్రిన్సిపాల్స్ లక్ష్మీనారాయణ, ఫాతిమా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

• పెళ్లయిన ఏడు నెలలకే బలవన్మరణం


శ్రావణి(ఫైల్)

కరీంనగర్‌క్రైం: అదనపు కట్నం తీసుకురావాలనే అత్తింటివారి వేధింపులు భరించలేక ఒక వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కట్టరాంపూర్‌లో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ కథనం ప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్ ప్రాంతానికి చెందిన దొంత అజయ్‌కుమార్‌కు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం ఎల్లంపల్లికి చెందిన శ్రావణి(22)తో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వివాహ సమయంలోనే పుట్టింటివారు కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయితే, కొద్ది రోజులుగా శ్రావణి భర్త అజయ్‌కుమార్, అత్త ఉపేంద్ర, మామ అంజయ్య కలిసి అదనపు కట్నం కావలని ఆమెను వేధిస్తున్నారు. ఆ వేధింపులు భరించలేక మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై మృతురాలు తండ్రి సంగెం కొమురయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా, వివాహమైన సుమారు ఏడు నెలలకే చనిపోవడంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు, బంధువు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు తరలివచ్చారు. వారిరాకతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న ఏసీపీ నరేందర్, సీఐ కోటేశ్వర్ తమ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుళ్ల భర్తీ

సిరిసిల్లకల్చరల్: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్‌ఎఫ్)లో కానిస్టేబుళ్ల (ఫైర్) భర్తీకి ప్రకటన విడుదలైందని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను పంపించాలన్నారు. ఈ నెల 30 లోపు http://cisfrectt.cisf.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారాలు పొందవచ్చని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కర్రసాములో ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్య అందించేందుకు కర్రసాములో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు పున్నం చందర్ ప్రకటనలో తెలిపారు. 12 నుంచి పాతికేళ్ల లోపు వయసు గల ఆడపిల్లలు మాత్రమే శిక్షణకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ వివరాలను గూగుల్ ఫారమ్ నింపడం ద్వారా ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఒడ్నాల శ్రీనివాస్ 90149 80292 లేదా అలువాల ఈశ్వర్ 96666 61254 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

గంభీరావుపేట: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లెకి చెందిన వట్టిమల్ల ఎల్లయ్య (78) మంగళవారం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి బస్టాండ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. ఎల్లయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కరీంనగర్‌లోని ఆస్పత్రికి వెళ్తుండగా బస్సులోనే గుండెపోటు వచ్చింది. దీంతో వృద్ధుడిని కిందకు దించుతుండగానే మృతిచెందాడు. 108 సిబ్బంది మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆక్రమణల పర్వం

• కబ్జాకు గురవుతున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీల స్థలాలు
• గతంలో హద్దుల ఏర్పాటుకు సర్వే చేసిన అధికారులు
• అనంతరం శాశ్వత హద్దుల ఏర్పాటులో నిర్లక్ష్యం
• సుమారు వెయ్యి ఎకరాల మేర ఆక్రమణలు..?


నీలోజపల్లిలోని ప్రభుత్వ ప్లాట్లలో పంటల సాగు

బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో మిగులు భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలనీల్లో నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ సంబంధిత నిర్మాణాలైన పాఠశాలలు, పీహెచ్‌సీలు, జీపీలు, తదితరవాటికి ప్లాట్లు పంపిణీ చేసిన అనంతరం మిగిలిన ఖాళీ స్థలాలకు రక్షణ లేకుండాపోయింది. గతంలో హద్దుల ఏర్పాటుకు సంబంధిత అధికారులు సర్వే చేశారు. తాము చూపిన చోట హద్దులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆయా కాలనీల పంచాయతీ కార్యదర్శుల దేనని సర్వే అధికారులు చెబుతున్నారు. దీంతో హద్దుల సర్వే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. రెండేళ్ల క్రితం ఆర్‌అండ్‌ఆర్ ప్లాట్ల క్రయ, విక్రయాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ప్లాట్ల పరిసరాల్లో మిగిలిన స్థలాల ఆక్రమణలు పెరిగినట్లు తెలుస్తోంది.

ముంపులో 12 గ్రామాలు..

మిడ్‌మానేరు నిర్మాణంలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల పరిధిలోని 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో 11,731 మంది నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించింది. ఒక్కో నిర్వాసితునికి 242 చదరపు గజాల స్థలాన్ని పట్టాగా అధికారులు అందించారు. బోయినపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ మండలాల పరిధిలోని 12 ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు స్థలం గుర్తించి నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ క్రమంలో నిర్వాసితులకు కేటాయించగా మిగిలిన ప్లాట్లు సుమారు 1,213 ఉన్నాయని తెలిసింది. ఇటీవల కాలంలో మిగిలిన ప్లాట్లు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురవుతున్నాయని, ఖాళీ స్థలాలను కబ్జా చేసి పంటలు పండిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.


గతంలో నీలోజపల్లిలో కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు వెల్లువెత్తిన స్థలం

వెయ్యి ఎకరాల మేర ఆక్రమణ..?

మిడ్‌మానేరుతో పాటు ముంపు గ్రామాల స్థానంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణాలకు ప్రభుత్వం సుమారు 40 వేల ఎకరాల భూమి సేకరించిందని అధికారులు చెబుతున్నారు. కాగా ఇందులో అన్ని ముంపు గ్రామాల్లో కలిపి సుమారు వెయ్యి ఎకరాల మేర ఆక్రమణకు గురైనట్లు సమాచారం. వేములవాడ, బోయినపల్లి మండలాల పరిధిలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో ప్లాట్ పక్కన ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు 2 గుంటల స్థలం ఉంటే పక్కన కొంత స్థలం ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు తెలిసింది. నీలోజిపల్లి కాలనీ రోడ్డు పరిసరాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి సుమారు 8 గుంటలు, పాఠశాల, ఏయిర్‌టెల్ టవర్ పరిసరాల్లో ఒకరు 4 గుంటలు స్థలం ఆక్రమించుకున్నట్లు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. వేములవాడ మండలం అనుపురం, కొడుముంజ, రుద్రవరం కాలనీల్లో ప్రైవేటు వెంచర్ల రియల్ దందా సాగినా పట్టించుకున్నవారే లేరు. వేములవాడ డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ బాలచంద్రం, సర్వేయర్ విజయేందర్ కాలనీల్లో హద్దుల సర్వే చేశారు. క్షేత్రస్థాయిలో పలు ఆక్రమణలను గుర్తించినట్లు సమాచారం. సర్వే అనంతరం హద్దుల ఏర్పాటు చేయడం పంచాయతీలకు వదిలేశారు. కాగా, పంచాయతీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణల పర్వం ఆగడం లేదు.

పంటలు సాగు చేస్తున్నరు



ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని మిగులు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. హద్దులు చెరిపేసి ఆక్రమించుకుంటున్నారు. కాలనీల చుట్టూ బౌండ్రీస్ ఏర్పాటు చేయాలి. ప్లాట్లలో సైతం పత్తి పంటలు వేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సింగిరెడ్డి బాలమల్లు, నీలోజిపల్లి

ఆక్రమిస్తే చర్యలు



ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో భూ ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవు. కబ్జాకు గురైనట్లు తెలిస్తే సర్వేయర్‌తో తనిఖీ చేయిస్తున్నాం. స్థలాలు ఆక్రమించినట్లు ఇప్పటి వరకు ఫిర్యాదులు రాలేదు. భూములు కబ్జాకు గురికాకుండా చూస్తాం.

– రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ

మల్లయ్య కుంట ఎక్కడ..?


మిల్లు నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, కలుషిత నీరు

• ఆక్రమణకు గురైనట్లు ప్రజావాణిలో గ్రామస్తుల ఫిర్యాదు
• కుంట స్థలంలో రైస్‌మిల్లుల నిర్మాణం..?
• మోకాపై అధికారుల తనిఖీ.. రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: మల్లయ్యకుంటను ఆక్రమించి నిర్మించిన రైస్‌మిల్లుల ద్వారా తమ పొలాలు దెబ్బతింటున్నాయని గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలు పాటించని మిల్లులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలోని మారుతి, మహాలక్ష్మి రైస్‌మిల్లులను ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ భారతి, ఈడీఎస్‌సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, పొల్యూషన్ కంట్రోల్ ఆఫీసర్ జ్యోతి, తహసీల్దార్ సుజాత, వేములవాడ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అన్సారీ, సర్వేయర్ సంపత్, జీపీ కార్యదర్శి వినోద్, వివిధ శాఖల అధికారులు తనిఖీ చేశారు. 750 సర్వేనంబర్‌లో మల్లయ్యకుంట ఉన్నట్లు అధికారులకు ఎక్కడా ఆనవాళ్లు కానరాకపోవడంతో కుంట ఎక్కడా అని ఆరా తీశారు. సంబంధిత రికార్డులు తేవాలని మిల్లు యజమానులను కోరగా ప్రస్తుతం అందుబాటులో లేవని తర్వాత అందజేస్తామని దాటవేశారు. దీంతో సాయంత్రం వరకు కార్యాలయంలో అందజేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామంటూ యజమానులను అధికారులు హెచ్చరించారు.

నిబంధనలు తూచ్

మిల్లుల యజమానులు నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టినట్లు గ్రామస్తులు ఆరోపించారు. పక్కనే కస్తూరిబా పాఠశాల ఉన్నా అప్పటి అధికారులు మిల్లులకు అనుమతి ఇవ్వడంతోనే నిర్మాణాలు చేసుకున్నారని అధికారులకు వివరించారు. మిల్లుల నుంచి వెలువడుతున్న కలుషిత నీటితోపాటు వ్యర్థాలతో పొలాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, దుర్వాసనతో పాఠశాల విద్యార్థులు కూడా అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. కాగా మిల్లులో హరితహారం కింద ఒక్క మొక్క కూడా నాటలేదని యజమానులపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుంట స్థలంలోనే మిల్లుల నిర్మాణం..?

మర్రిపల్లి శివారులోని 750 సర్వేనంబర్‌లో మల్లయ్యకుంట ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ప్రకారం చెబుతున్నారు. కానీ, ప్రస్తుతం ఆ ప్రాంతంలో రెండు రైస్‌మిల్లులు నిర్మించడంతో కుంట ఆనవాళ్లు లేకుండాపోయింది. అధికారులకు కుంట ఆనవాళ్లు కనిపించకపోవడంతో కంగుతిన్నారు. కుంట స్థలం ఎక్కడా అని యజమానులను ప్రశ్నించగా తమకు ఎలాంటి కుంట ఈ ప్రాంతంలో కనిపించలేదని వారు చెప్పుకొచ్చారు. రెవెన్యూ నక్ష ప్రకారం 750 సర్వేనంబర్‌లో కుంట ఉన్నట్లు గుర్తించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు.

గ్రాడ్యుయేట్లు మళ్లీ ఓటు నమోదు చేసుకోవాలి


కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అధికారులు

సిరిసిల్ల: మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్లు, ఖమ్మం నల్గొండ జిల్లాల టీచర్ల శాసనమండలి సభ్యుల నియోజకవర్గ స్థానాల ఎన్నికల్లో ఓటు వేసే గ్రాడ్యుయేట్స్, టీచర్లు మళ్లీ ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. గ్రాడ్యుయేట్స్, టీచర్ల శాసన మండలి ఎన్నికల్లో గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి ఓటుహక్కును నమోదు చేయించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. నూతన ఓటర్ నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90 శాతం పైగా సర్వే పూర్తయిందన్నారు. ఈనెల 28 నాటికి వందశాతం పూర్తి చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదని స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, తహసీల్దార్లు షరీఫ్, మహేశ్, ఎన్నికల డీటీ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పదోన్నతులు

• భర్తీకాని ఎంపీడీవో పోస్టులు

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలోని ముస్తాబాద్, చందుర్తి ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇల్లంతకుంట, చందుర్తి మండల పరిషత్‌ల సూపరింటెండెంట్‌లకు పంచాయతీరాజ్ కమిషనర్ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఈనెల 2న ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వెలువడి 20 రోజులు దాటినా సదరు సూపరింటెండెంట్‌లను ఆ శాఖ అధికారులు రిలీవ్ చేయడం లేదని తెలిసింది. ముస్తాబాద్ ఎంపీడీవో పోస్టు నాలుగు నెలల నుంచి ఖాళీగా ఉంది. ఇన్‌చార్జి ఎంపీడీవోతోనే ఇక్కడ పాలన జరుగుతుంది. చందుర్తి ఎంపీడీవోగా ఎస్.శ్రీనివాస్, ముస్తాబాద్ ఎంపీడీవోగా ఎం.శ్రీనివాస్ రావాల్సి ఉండగా, వీరి ఫైల్ కలెక్టరేట్‌లోనే ఆగిపోయిందని సమాచారం. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లినట్లు తెలిసింది.

విప్‌ను కలిసిన దివ్యాంగులు


విప్ ఆదికి వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు


సిరిసిల్లటౌన్/ వేములవాడ: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను జిల్లా దివ్యాంగ సమితి సభ్యులు మంగళవారం కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో వారి సమస్యను వివరించారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు బేస్డ్ ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కోరారు. ప్రత్యేకంగా హాస్టల్ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై విన్నవించారు. ఇందుకు విప్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సమితి అధ్యక్షుడు మాదాసు రాజేశ్, ఉపాధ్యక్షుడు యెల్లె హరిప్రసాద్, మన్మోహన్, రాజేందర్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్ వద్ద రోడ్డు దాటుతున్న గరిగె స్వరూప (49) అనే మహిళను మంగళవారం బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించింది. బస్టాండ్ ప్రాంతంలోని హోటల్‌లో కూలిగా పనిచేసే స్వరూప ఎప్పటిలాగే పనికోసం బయల్దేరగా పూసాలకు చెందిన వసంత్‌కుమార్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉపాధి లేదనే బెంగతో నేత కార్మికుడికి గుండెపోటు

• పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం
• అంత్యక్రియలకు కూడా డబ్బులు లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


సూర్యనారాయణ (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: ఉపాధి లేదనే బెంగతో నేత కార్మికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని చంద్రంపేటలో జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. చంద్రంపేటకు చెందిన కొండ బత్తిని సూర్యనారాయణ (55) సాంచాలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో రూ.5 లక్షల అప్పు చేసి రేకుల షెడ్డు నిర్మించాడు. ఈ మధ్యకాలంలో సాంచాల పని బందుకావడంతో ఉపాధి లేకుండాపోయింది. దీంతో అప్పు ఎలా తీర్చాలని దిగులుపడుతూ ఉండేవాడు. సోమవారం రాత్రి ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మృతుడికి భార్య విజయ, కుమారుడు శివసాయికుమార్, కూతురు ప్రియాంక ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

అటవీశాఖ అధికారుల తీరుపై నిరసన

• ఇప్పపెల్లి గ్రామస్తుల ఆందోళన
• మెట్‌పల్లి డీఎస్పీ హామీతో విరమణ


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్(వేములవాడ): అటవీశాఖ అధికారుల తీరును నిరసిస్తూ కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లివాసులు మంగళవారం గ్రామ కూడలిలో ఆందోళన చేపట్టారు. గ్రామ శివారు అటవీ భూముల్లోని చెట్లను మూడేళ్లుగా ఇతర గ్రామస్తులు తొలగించి, చదును చేస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కానీ, గ్రామ అవసరాల కోసం ఇటీవల అందరం కలిసి, భూమిని చదును చేస్తే కొందరిపై కేసు పెట్టారంటూ మండిపడ్డారు. ఇతర గ్రామస్తులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి, సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోరుట్ల, మేడిపెల్లి ఎస్సైలు శ్రీకాంత్, శ్యాంరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇళ్లలోకి వెళ్లాలని సూచించినా గ్రామస్తులు పట్టించుకోలేదు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నీరంజన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని, ఆందోళనకారులతో మాట్లాడారు. అటవీశాఖ అధికారులు, గ్రామ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



స్వచ్ఛత.. బాధ్యత

సిరిసిల్లటౌన్: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో స్థానిక గీతానగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛతపై మానవహారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, ఈఈ రఘు, హెచ్‌ఎం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాలిస్టర్ సాంచాలపై కాటన్ బెడ్‌షీట్ల ఉత్పత్తి



ఇతని పేరు గడదాస్ రాజు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన రాజు గతంలో బతుకమ్మ చీరలను, పాలిస్టర్ వస్త్రాన్ని ఉత్పత్తి చేసేవాడు. ఇప్పుడు బతుకమ్మ చీరల ఆర్డర్లను ప్రభుత్వం ఇవ్వలేదు. పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేస్తే మార్కెట్‌లో డిమాండ్ లేదు. సాంచాలను బంద్ పెట్టి ఉంటే ఉపాధి ఉండదు. స్థానికంగా ఏదైనా వెరైటీ ఉత్పత్తితో ఉపాధి పొందాలని భావిస్తుండగా.. అశోక్‌నగర్‌కు చెందిన బైరి అమర్‌నాథ్ బెడ్‌షీట్ల భీములు పోశాడు. ఆ భీములను రాజు ఎక్కించాడు. పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేసే సాంచాలపై కాటన్ నూలు(ధారం)తో బెడ్ షీట్లను ఉత్పత్తి చేస్తున్నారు. రాజుకు ఆరు సాంచాలు ఉండగా 4 సాంచాలపై బెడ్‌షీట్లు, మరో 2 సాంచాలపై పాలిస్టర్ వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. ఒక్క మీటరు బెడ్‌షీట్ బట్టను ఉత్పత్తి చేస్తే రూ.4 వస్తాయి. అంటే రోజుకు ఒక్క సాంచాపై 50 మీటర్లు.. నాలుగు సాంచాలపై 200 మీటర్లు ఉత్పత్తి అవుతుంది. అంటే.. రోజుకు రూ.800 మేరకు రాజు ఉపాధి పొందుతున్నారు. మరో వైపు రెండు సాంచాలపై పాలిస్టర్ బట్ట ఉత్పత్తి ద్వారా అదనపు ఆదాయం లభిస్తుంది. ఇలా సిరిసిల్లలో 20 సాంచాలపై కాటన్‌బెడ్ షీట్ల ఉత్పత్తి సాగుతుంది.

• సిరిసిల్లలో కొత్త ఉపాధి బాటలు

సిరిసిల్ల: ప్రభుత్వం వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వడం లేదని, సాంచాలకు పని లేదని, సాంచాలు బంద్‌పడ్డాయని నిరాశగా దిక్కులు చూసే నేతన్నలకు కొత్త వస్త్రోత్పత్తులు నమ్మకమైన ఉపాధి చూపుతున్నాయి. అవే సాంచాలపై మార్కెట్‌లో డిమాండ్ ఉన్న టవల్స్ (తువ్వాల), కర్చీఫ్‌లు, లుంగీలను ఉత్పత్తి చేస్తే.. మార్కెట్‌లో ఆ వస్త్రాలు అమ్ముడుపోయి మెరుగైన ఉపాధి లభిస్తుంది. సిరిసిల్లలో కొత్తగా ఆలోచిస్తూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కాటన్ గోచీ చీరలను ఉత్పత్తి చేస్తున్నారు. కొందరు దోమ తెరలను, ఆస్పత్రిల్లో ఉపయోగించే బ్యాండేజీ వస్త్రాన్ని ఉత్పత్తి చేయడం విశేషం. ఇంకొందరు మరో అడుగు ముందుకేసి ఏకంగా లూమ్స్‌ను మార్చి ఆధునికమైన ర్యాపియర్ లూమ్స్‌ను ఇంట్లోనే వేసుకుని కొత్త ఉత్పత్తులను తెరమీదకు తెస్తున్నారు. నవ్యమైన వస్త్రోత్పత్తులను నాణ్యతతో చేస్తే, నమ్మకమైన ఉపాధి చేతినిండా ఉంటుంది. ఇప్పుడు సంక్షోభంలో ఉన్న వస్త్రపరిశ్రమలో కొత్త ఆలోచనలు ఉపాధికి ఆ'ధారం' కానున్నాయి. ఆ దిశగా నేతన్నలు మార్కెట్‌లో డిమాండ్‌గా అమ్ముడుపోయే వస్త్రాల ను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే నమ్మకమైన ఉపాధి నేతన్నలకు దరి చేరుతుంది.

మా పైసలతో పక్క గ్రామంలో పనులా..?


మండెపల్లి పంచాయతీ ఎదుట బైఠాయించిన గ్రామస్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తమ గ్రామానికి సంబంధించి నిధులు, పంచాయతీ ట్రాక్టర్, సిబ్బందిని ఇతర ప్రాంతాల వారికోసం కేటాయించవద్దని మండెపల్లి గ్రామస్తులు నిరసన తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ ఎదుట బైఠాయించి కేసీఆర్‌నగర్ కాలనీకి పంచాయతీ ట్రాక్టర్, సిబ్బంది వెళ్లకుండా అడ్డుకున్నారు. తాము కట్టిన పన్నులతో పక్క గ్రామానికి పనులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూం సముదాయ (కేసీఆర్‌నగర్) నిర్మాణం కోసం ఇప్పటికే వందల ఎకరాల భూమిని కోల్పోయామని పేర్కొన్నారు. కేసీఆర్‌నగర్‌ను కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాల్సి ఉండగా తమ పంచాయతీ నుంచి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. సిరిసిల్ల మున్సిపాలిటీ కేసీఆర్‌నగర్ బాగోగులు చూసుకోకుండా చేతులు దులుపుకుందని, జిల్లా అధికారులు ఇతర గ్రామాలపై ఆ భారాన్ని మోపకుండా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుచేసి పరిష్కారం చూపాలని కోరారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 1.44 కోట్లు



వేములవాడ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయ 12 రోజుల హుండీని మంగళవారం లెక్కించారు. రూ.1,44,06,154ల ఆదాయం, 710 గ్రాముల బంగారం, 14 కిలోల వెండి సమాకురినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.